సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం । 4 । జనవరి । 2025



నమో వేంకటేశా..

ద్వారకాతిరుమల: ధనుర్మాస వేడుకల్లో భాగంగా చిన వెంకన్న తిరువీధి సేవ నేత్రపర్వంగా జరిగింది. ఇంటింటా భక్తులు స్వామివారికి నీరాజనాలు అర్పించారు.



జాతీయ సైన్స్ కాంగ్రెస్‌కు ఎంపిక

భీమవరం అర్బన్: 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌కు దొంగపిండి హైస్కూల్ విద్యార్థిని నాగిడి లక్ష్మీప్రసన్న ఎంపికైంది. శుక్రవారం భోపాల్ బయలుదేరింది.

వరి కంకులతో అలంకరణ



భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మ వారికి శుక్రవారం వరి కంకులతో అలంకరించారు. సింగంశెట్టి సుబ్బారావు దంపతులు (బావట్ల) అలంకరణకు సహకరించారు.

న్యూస్‌రీల్

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: మహిళలంతా విద్యావంతులు కావాలని దేశంలో తొలిసారిగా మహిళా విద్యకు పునాది వేసిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక రాష్ట్రపతి రోడ్డులోని పూలే విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యతోనే ప్రాంతం, కుటుంబం అభివృద్ధి చెందుతుందనే ఉద్దేశాన్ని సమాజానికి చాటిచెప్పడమే కాకుండా ఆచరణలో చూపిన పూలేను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిన మహనీయురాలు పూలే అని స్పష్టం చేశారు. నాయకులు పొట్ల సురేష్, జంగం ఆనంద్‌కుమార్, జల్లూరి జగదీష్, షేక్ ఫహీమా, కొమ్మోజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ విధానాలతో ప్రజలకు అన్యాయం



సీపీఎం జిల్లా మహాసభల్లో సంఘీభావం తెలుపుతున్న నాయకులు

భీమవరం: రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ల అనుకూల విధానాలను అవలంబిస్తూ ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం 26వ జిల్లా మహాసభలను శుక్రవారం భీమవరంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు విజన్‌లో కేవలం కార్పొరేట్ వర్గాల తప్ప రైతులు, శ్రామికులు, కార్మికులు, ఉద్యోగులు, పేదలు లేరని మండిపడ్డారు. చంద్రబాబు సూపర్ సిక్స్ అమలులో రనౌట్ అవుతున్నారని ఎద్దేవా చేశారు. జిల్లా కార్యదర్శి బి.బలరామ్ మాట్లాడుతూ పచ్చని పశ్చిమగోదావరి జిల్లా కాలుష్య గోదావరిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జేఎన్‌వీ గోపాలన్, చింతకాయల బాబురావు, బి.వాసుదేవరావు పాల్గొన్నారు.

6న గ్రామ సభలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలోని ఆకివీడు, ఉండి, పెంటపాడు, గణపవరం, కాళ్ల మండలాల్లో ఎకో సెన్సిటివ్ జోన్ ఖరారుపై ఈనెల 6న గ్రామసభలు నిర్వహించనున్నట్టు ఎకో సెన్సిటివ్ జోన్ జిల్లా మానిటరింగ్ కమిటీ చైర్మన్, కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. కొల్లేరు అభయారణ్యం చుట్టుపక్కల ఎకో సెన్సిటివ్ జోన్ ఖరారు చేయడంపై ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో సభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. ఆకివీడులో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు, మిగిలిన చోట్ల మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సభలు నిర్వహిస్తామని చెప్పారు.

నేడు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

భీమవరం: వీరవాసరం ఎంఆర్‌కే జెడ్పీ హైస్కూల్‌లో శనివారం జరిగే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేయాలని సర్వశిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్, జిల్లా సైన్స్ అధికారి వీఎంజెడ్ శ్యాంప్రసాద్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. వైజ్ఞానిక ప్రదర్శన కోసం ఏర్పాటుచేసిన కమిటీలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎగ్జిబిట్స్‌ను సకాలంలో ఏర్పాటుచేసి ప్రదర్శించాలని కోరారు.

భూసేకరణ వేగిరపర్చాలి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో ఎన్‌హెచ్–165 భూసేకరణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో పామర్రు–దిగమర్రు ఎన్‌హెచ్–165 భూసేకరణలో భాగంగా ఆరు కిలోమీటర్ల పరిధిలో ఆకివీడు మండలంలోని ఆకివీడు, దుంపగడప, అజ్జమూరు గ్రామాలకు చెందిన భూములకు సంబంధించి భూసేకరణ అధికారి భీమవరం ఆర్డీఓ తయారుచేసిన అవార్డులపై విచారణ నిర్వహించారు. భూ సేకరణ కొలతలు, భూ యజమానుల పేర్లు తప్పుల సవరణ, ఫిర్యాదుల స్వీకరణకు ఒక తేదీని ఖరారు చేసి గ్రామ సభలు నిర్వహించాలని సూచించారు. ఆర్డీఓ కె.ప్రవీణ్‌కుమార్ రెడ్డి, ల్యాండ్ సూపరింటెండెంట్ రవికుమార్, ఎన్‌హెచ్–165 ఏఈ ఖాజా పాల్గొన్నారు.

- బాబు ష్యూరిటీ.. లేదు గ్యారంటీ

సూపర్ వంచన

2025.. సంక్షేమం అందదు

- 2024 జూన్ నుంచి సూపర్ సిక్స్ అంటూ బాండ్లు ఇచ్చిన కూటమి నేతలు
- ఆరున్నర నెలల పాలనలో ఊసెత్తని ప్రభుత్వం
- ఈ ఆర్థిక సంవత్సరానికి ఎగనామం పెడుతూ కేబినెట్ నిర్ణయం
- జిల్లాలో 1.74 లక్షల మంది పిల్లలకు 'తల్లికి వందనం' దూరం
- 1.24 లక్షల మంది రైతులకు రూ.249 కోట్ల నష్టం
- 5.96 లక్షల మంది మహిళలకు అందని 'ఆడబిడ్డ సాయం'
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ భృతి ఊసెత్తని వైనం



సాక్షి, భీమవరం: అధికారంలోకి రావడమే ఆలస్యం.. జూన్ నెల నుంచే సూపర్ సిక్స్ పథకాలు అమలులోకి తెస్తామని ఎన్నికల ముందు కూటమి నేతలు చెప్పారు. 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' అంటూ ఇంటింటికి వెళ్లి ఇంటిలోని కుటుంబ సభ్యులకు సూపర్ సిక్స్‌లో వర్తించే పథకాలు, చేకూరే లబ్ధితో బాండ్ పేపర్లంటూ సంతకాలు చేసి మరీ ఇచ్చారు. తల్లికి వందనం కింద ఎందరు పిల్లలుంటే అందరికి ఏడాదికి ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున ఇప్పించే బాధ్యత తమదన్నారు. అన్నదాతకు ఏడాదికి రూ.20 వేల సాయం అందిస్తామని చెప్పారు. ఉద్యోగాలు వచ్చే వరకూ నిరుద్యోగులకు నెలకు రూ.3,000 భృతి ఇస్తామన్నారు. ఆడబిడ్డ నిధి కింద ప్రతి మహిళకూ నెలకు రూ.1,500లు జమచేస్తామన్నారు. ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తామని ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక పింఛన్‌ను రూ.3,000 నుంచి రూ.4,000లకు పెంచిన పాలకులు ఈ ఆర్థిక సంవత్సరానికి ఒక్క గ్యాస్ సిలెండరే అంటూ మాట మార్చారు.

పేదల ఆశలపై నీళ్లు

కొత్త ఏడాదిలోనైనా కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తుందేమోనన్న పేదవర్గాల ఆశలపై కూటమి సర్కారు నీళ్లు చల్లింది. గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాటి ఊసేలేదని తేల్చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పథకాల అమలుపైనా స్పష్టత ఇవ్వకుండా మహిళలు, రైతులు, విద్యార్థులు, నిరుద్యోగులకు మొండిచేయి చూపింది. కూటమి వంచనతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను తల్లికి వందనం పథకం అమలుకాక జిల్లాలోని సుమారు 1.74 లక్షల మంది విద్యార్థులకు గాను వారి తల్లులు రూ.261 కోట్లు కోల్పోయారు. అన్నదాత సుఖీభవ సాయం అందక సుమారు 1,24,645 మంది రైతులు రూ.249.29 కోట్లు నష్టపోయారు. ఆడబిడ్డ నిధి పథకానికి జిల్లాలో అర్హత కలిగిన మహిళలు సుమారు 5,96,313 మంది ఉండగా నెలకు రూ.1,500లు చొప్పున ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో పది నెలల కాలానికి రూ.894.46 కోట్ల సాయాన్ని కోల్పోయారు. జిల్లాలో 5.17 లక్షల కుటుంబాలకు గాను 50 శాతానికి పైగా చదువుకు తగిన ఉద్యోగం రాక ఇబ్బంది పడుతున్నారు. వీరికి నిరుద్యోగభృతి అందించాల్సి ఉంది. తొమ్మిది లక్షల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నారు.

నాడు తలుపుతట్టిన సంక్షేమం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి **హయాంలో సంక్షేమం** పేదింటి తలుపు తట్టింది. **కులమత వర్గాలు,** రాజకీయాలకు అతీతంగా, **పేదరికమే ప్రామా**ణికంగా అర్హత కలిగిన **ప్రతిఒక్కరికీ సంక్షేమ** లబ్ధి చేకూరింది. సంక్షేమ **క్యాలెండర్‌ను విడుదల** చేసి నిర్ణీత తేదీన **నేరుగా లబ్ధిదారుల** ఖాతాలకు ప్రభుత్వ **సాయం జమచేస్తూ వ**చ్చారు. అమ్మఒడి, రైతు **భరోసా, వైఎస్సార్ ఆ**సరా, చేయూత, కాపునేస్తం, **ఈబీసీ నేస్తం త**దితర సంక్షేమ పథకాల **ద్వారా డీబీటీ,** నాన్ డీబీటీ రూపంలో **జిల్లాలోని పేదవర్గాల** వారికి వందల కోట్ల రూపాయల లబ్ధిని చేకూర్చారు.

బాండ్ల సంగతి మరచి.. సంక్షేమాన్ని విస్మరించి..

బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట కనిపిస్తున్న ఈ బాండ్ పేపర్‌ను గమనించారా? కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 2024 జూన్ నెల నుంచి ఇంటిలోని కుటుంబ సభ్యులకు వర్తించే పథకాలు, వాటి ద్వారా ఏడాదిలో చేకూరే లబ్ధి మొత్తాన్ని వివరిస్తూ కూటమి నేతలు ఇంటింటికీ పంపిణీ చేసిన పత్రాలు. పాలకొల్లు నియోజకవర్గంలోని ఒక మహిళ కుటుంబంలో నలుగురు సభ్యులకు గాను ఇద్దరు మహిళలకు ఆడబిడ్డ నిధి పథకం కింద ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.36 వేలు, ఇద్దరు నిరుద్యోగ యువకులకు యువగళం పథకం కింద నెలకు ఒక్కొక్కరికీ రూ.3,000 చొప్పున ఏడాదిలో రూ.72 వేలు మొత్తంగా రూ.1.08 లక్షల లబ్ధి చేకూరుతుందని కూటమి నేతలు సంతకాలు చేసి మరీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన ఈ ఏడు నెలల్లో బాండ్ పేపర్ మేరకు ఆయా పథకాల ద్వారా ఆ కుటుంబానికి రూ.63,000 లబ్ధి చేకూరాల్సి ఉంది. కాగా ఇప్పటివరకు ఆ పథకాల ఊసేలేదు.



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు పంచిన బాండ్ పేపర్ (ఫైల్)

హామీలను ఎగ్గొట్టారు



ఎన్నికల హామీలను ఎగ్గొట్టడంలో చంద్రబాబు దిట్ట. తాను చెప్పింది చేయనని మరోసారి నిరూపించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయకుండానే ఈ ఆర్థిక సంవత్సరాన్ని గడిపేస్తున్నారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే ఈపాటికే పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందేవి.

– గూడూరి ఉమాబాల, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం కన్వీనర్

దారుణంగా వంచించారు



కూటమి నాయకులు సూపర్ సిక్స్ అంటూ ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చాక దారుణంగా వంచిస్తున్నారు. సంక్షేమం జాడలేక పేదలు చాలా ఇబ్బంది పడుతున్నారు. కొత్త సంవత్సరంలో అయినా వాటి అమలు ఉంటుందని ఆశిస్తే కేబినెట్ సమావేశం నిరాశనే మిగిల్చింది.

– బందన పూర్ణచంద్రరావు, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా కో–ఆర్డినేటర్

బూటకపు హామీలతో..



సూపర్ సిక్స్ అమలుచేయకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తల్లికి వందనం అమలుచేయలేదు. విద్యాదీవెన నిధులను కళాశాలలకు చెల్లించకపోవడంతో యాజమాన్యాల ఒత్తిడితో తల్లిదండ్రులు ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. కూటమి ప్రభుత్వానివి బూటకపు హామీలు.

– పొట్ల సురేష్, న్యాయవాది, తణుకు

ఆర్థికంగా ఇబ్బంది



గత ప్రభుత్వంలో అమ్మఒడి, చేయూత పథకాల ద్వారా మా కుటుంబం లబ్ధి పొందింది. కూటమి ప్రభుత్వం ఈ పథకాలు అమలు చేయకపోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. ఈ ఏడాదైనా సంక్షేమ పథకాలు అమలు చేసి పేదలను ఆదుకోవాలని కోరుతున్నాం.

– నంద్యాల నాగమణి, మందపాడు, ఆకివీడు మండలం

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడదాం

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాకు అండగా ఉంటాం
- పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా సమావేశంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి, మాజీ మంత్రి కారుమూరి, ఎమ్మెల్సీ కవురు, పార్లమెంట్ ఇన్‌చార్జి ఉమాబాల, పాలకొల్లు ఇన్‌చార్జి గోపి

కాళ్ల: కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని, వైఎస్సార్‌సీపీకి వెన్నెముకగా సోషల్ మీడియా ఉండాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని పెదఅమిరంలోని పార్టీ కార్యాలయంలో సోషల్ మీడియా జిల్లా సమావేశాన్ని సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు బందన పూర్ణచంద్రరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు సోషల్ మీడియా కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ఖండించారు. గత ఎన్నికల్లో పార్టీ ఓటమికి కారణాలపై చర్చించారు. కార్యకర్తలకు సముచితస్థానం కల్పిస్తామన్నారు. పూర్ణచంద్రరావు నేతృత్వంలో జిల్లాలోని ఏడు నియోజకవర్గాలు, మండలాల్లో సోషల్ మీడియా కన్వీనర్లను ఏర్పాటుచేస్తామన్నారు. కార్యకర్తల కోసం లీగల్ సెల్ తరపున జిల్లా కార్యాలయంలో ఒక అడ్వకేట్‌ను కూడా నియమిస్తామన్నారు. ప్రజల పక్షాన సోషల్ మీడియా పనిచేయాలని కోరారు. పార్టీ చేస్తున్న పోరాటాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో జిల్లాలో మొదటి సమావేశం ఏర్పాటుచేస్తామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా బాగా పనిచేస్తుండటంతో కూటమి ప్రభుత్వం భయపడుతోందని, అందుకే అణగదొక్కాలని కేసులు పెడుతోందని ముదునూరి అన్నారు.

సోషల్ మీడియా అంటే ప్రభుత్వానికి హడల్

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా అంటే కూటమి ప్రభుత్వానికి హడల్ అన్నారు. అబద్ధాలు చెప్పి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయడానికి సీఎం చంద్రబాబు భయపడుతున్నారన్నారు. ఈవీఎంల ఎమ్మెల్యేలు, ఈవీఎంల ముఖ్యమంత్రిని చూసి ఎవరూ భయపడవద్దని, సోషల్ మీడియా కార్యకర్తల కోసం అధినేత జగన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. ఎవరికి ఏకష్టమొచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. సోషల్ మీడియాలో అసభ్య పదజాలాలు మాట్లాడకుండా సబ్జెక్ట్‌పై మాత్రమే పోస్టులు పెట్టాలని సూచించారు.

సేవలు భేష్ : ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సోషల్ మీడియా కార్యకర్తల సేవలు అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరికీ మంచి రోజులు వస్తాయని ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను సోషల్ మీడియా ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

కూటమి నాయకులది దుష్ప్రచారం

నరసాపురం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ల్యాండ్ టైటిల్ యాక్ట్‌పై కావాలనే కూటమి నాయకులు దుష్ప్రచారం చేశారన్నారు. సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు దొడ్డ అంజిరెడ్డి, పార్టీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి మాట్లాడుతూ కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం సోషల్ మీడియా కార్యకర్తలు తమ అభిప్రాయాలను తెలియజేశారు. సోషల్ మీడియా జిల్లా ఉపాధ్యక్షుడు రామలింగేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలి రాంబాబు, అధికార ప్రతినిధులు కోట సత్యనారాయణ, కామన నాగేశ్వరరావు, ముప్పిడి సంపత్‌కుమార్, జి.సుందర్‌కుమార్ గుబ్బల వీరబ్రహ్మం, వేణుమాధవరెడ్డి, కోడె యుగంధర్, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మవారి జాతర మహోత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఉత్సవాలపై ఎమ్మెల్యే అంజిబాబుతో కలిసి ఆయన కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ ఈనెల 13 నుంచి వచ్చేనెల 14 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నామన్నారు. అన్నిశాఖల అధికారుల సమన్వయంతో ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. జాతర కమిటీ సభ్యులు ఏర్పాట్లకు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ 60 ఏళ్లుగా జాతరను నీరుల్లి, కూరగాయల వర్తక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారన్నారు. ఫిబ్రవరి 14 భారీ అన్నసమారాధన రోజున ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్‌రెడ్డి, జిల్లా దేవదాయ శాఖ అధికారి వీ.సుబ్బారావు, దేవస్థాన అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీనగేష్ తదితర అధికారులు పాల్గొన్నారు.



లాంగ్ జంప్ చేస్తూ..

- గెలుపు పొందె వరకూ.. అలుపు లేదు మాకు

ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు కానిస్టేబుళ్ల నియామక ప్రక్రియ కొనసాగుతోంది. శుక్రవారం ఏలూరు పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ దగ్గరుండి పర్యవేక్షించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో 490 మంది మహిళా అభ్యర్థులకు 242 మంది హాజరయ్యారని, వారిలో 102 మంది ఎంపికైనట్టు ఎస్పీ చెప్పారు. అభ్యర్థులకు పరుగు, లాంగ్‌జంప్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పరీక్షల నిర్వహణలో ఉన్నారు.


– ఏలూరు టౌన్



పరుగు పరీక్షలో అభ్యర్థినులు



అభ్యర్థిని ఎత్తు కొలతలను పరిశీలిస్తున్న ఎస్పీ



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

అధికారుల అండతోనే యథేచ్ఛగా పశువధ



మాట్లాడుతున్న గోసేవా సమితి సభ్యులు

తణుకు అర్బన్: తణుకు ప్రాంతంలో పాలకులు, అధికారులు అందిస్తున్న ప్రోత్సాహంతోనే తేతలిలో లాహం ఫుడ్ ప్రొడక్ట్ సంస్థలో పశువధ కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయని గోసేవా సమితి సభ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్, జల్లూరి జగదీష్‌లు ఆరోపించారు. తణుకులో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 20 రోజులుగా పశువధపై ఆందోళనలు చేస్తుండగా అణచివేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత 31న 144 సెక్షన్ పేరుతో కర్మాగారం ముందు వేసిన టెంట్లను పోలీసులు తొలగించారని, మరుసటి రోజు నుంచి యథావిధిగా పరిశ్రమలో పశువులను వధిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు వ్యతిరేకిస్తున్న పరిశ్రమ చుట్టూ పోలీసుల పహరాలో పశువులను లోపలకు పంపించి వధించడం బాధాకరమని అన్నారు. తణుకులో నిరసన దీక్షలకు అనుమతి కోరితే 144 సెక్షన్ అమల్లో ఉందని, కుదరదని పోలీసులు చెప్పారన్నారు. ఉద్యమంపై ఉక్కుపాదం మోపే దిశగా అధికార యంత్రాంగం పనిచేస్తోందని విమర్శించారు. అయినా ఆందోళన ఆగదని సేవ్ తణుకు పేరుతో ప్రసార సాధనాలు, సోషల్ మీడియాలో పోరాడతామని హెచ్చరించారు. పరిశ్రమకు సంబంధించి అధికారుల వద్ద ఏ విభాగంలోనూ పూర్తిస్థాయి అనుమతులు లేవన్నారు. ఐ.శ్రీనివాసరావు, మల్లుల శ్రీనివాస్, కోట వెంకట బాలకృష్ణ, కర్రి రాజశేఖర్, పసుపులేటి సూరిపండు, పంగం ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దరావిగూడెం పాఠశాల పరిశీలన



మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తి

కుక్కునూరు: మండలంలోని పెద్దరావిగూడెంలోని ఎంపీయూపీ పాఠశాలను శుక్రవారం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్‌టీవీ శ్రీనివాస్ పరిశీలించారు. శ్రీనివాస్ స్వగ్రామం పెద్దరావిగూడెం కావడంతో ఇక్కడకు వచ్చిన ఆయన పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాలలో మౌలిక వసతులపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతుల కల్పనకు తక్షణ సాయం కింద చెక్కు అందించారు. ప్రధానోపాధ్యాయుడు, సర్పంచ్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ప్రధాన న్యాయమూర్తిని సత్కరించి మెమెంటో అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీలో టెక్ హ్యాకథాన్ పోటీలు



పోటీలు పరిశీలిస్తున్న ఇన్వెంటిజ్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు మన్నె ఇంద్రజిత్

నూజివీడు : స్థానిక ట్రిపుల్ ఐటీలో ఆర్జీయూకేటీ స్థాయి ఫేజ్–2 టెక్ హ్యాకథాన్ పోటీలను శుక్రవారం ఆర్జీయూకేటీ వీసీ ఆచార్య ఎం.విజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవిష్కరణ, ఆచరణాత్మక సమస్య పరిష్కార నైపుణ్యాలు పెంపొందించడానికి ఇలాంటి ఈవెంట్లు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను బయటకు తీసుకురావడానికి హ్యాకథాన్ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇన్వెంటిజ్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు మన్నె ఇంద్రజిత్ మాట్లాడుతూ వాస్తవ ప్రపంచ సవాళ్లను ఎదుర్కొనడానికి ఈ తరం విద్యార్థులు చేస్తున్న కృషిని అభినందించారు. వినూత్న మొబైల్ అప్లికేషన్ల తయారీ ఈ హ్యాకథాన్ పోటీల లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్, ఏఓ బీ లక్ష్మణరావు, సీఏఓ బండి ప్రసాద్, సెంట్రల్ డీన్ డీ శ్రావణి, సెంట్రల్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పీ శ్యామ్, డీన్ అకడమిక్స్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తులపై కేసు


భీమవరం : భీమవరం వన్‌టౌన్ పరిధిలో శుక్రవారం బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ నెల 2న గునుపూడికి చెందిన బాలిక పట్ల జామి రవి, పోతునూరి వినమ్, జామి దుర్గారావు అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు వారిని పశ్నించారు. రవి, వినమ్, దుర్గారావులు తమను కొట్టి గాయపరిచారంటూ బాలిక చిన్నాన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కిరణ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలిక చిన్నాన్న పాత గొడవలు పురస్కరించుకుని కొట్టి గాయపరిచాడని దుర్గారావు కూడా ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

30 కాసుల బంగారం చోరీ

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధిలో శుక్రవారం తాళంవేసి ఉన్న ఇంట్లో 30 కాసుల బంగారం చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండో పట్టణ పరిధి అడ్డవంతెన సమీపంలోని కె.రాంబాబు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి గత నెల డిసెంబర్ 20న హైదరాబాద్ వెళ్లారు. జనవరి 2న తిరిగి వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటంతో వెంటనే బీరువాలో వస్తువులు చెల్లాచెదురుగా ఉన్నాయి. 30 కాసుల బంగారం, 50 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు కె.రాంబాబు ఫిర్యాదు చేశారు. సీఐ జి.కాళీచరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంధుల జీవితాల్లో అక్షరాల వెలుగులు

- నేడు ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం
- ఉద్యోగాల్లో సత్తా చాటుతున్న అంధులు



కైకలూరు: అంధత్వం చదువును దూరం చేయకుండా.. ఆ చదువులు వారి జీవితాల్లో వెలుగులు నింపేలా లూయిస్ బ్రెయిలీ కనిపెట్టిన లిపి ఒక అద్భుతం. ఎందరో అంధులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఈ బ్రెయిలీ లిపి మార్గం చూపింది. కంటి చూపు లేకపోయినా బ్రెయిలీ లిపితో కలెక్టర్ల స్థాయికి ఎదిగారు. విద్య, రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఇలా అనేక ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ఏటా జనవరి 4న బ్రెయిలీ జన్మదినోత్సవం సందర్భంగా ప్రపంచ బ్రెయిలీ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. జిల్లా భవిత కేంద్రాల్లో బ్రెయిలీ లిపిపై శనివారం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అంధుల కోసం ప్రత్యేక పాఠశాలలు

పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటర్ వరకు చదువుతున్న వారిలో 329 మంది విద్యార్థులకు దృష్టి లోపం, మరో 221 మందికి అంధత్వం ఉంది. మన రాష్ట్రంలో నరసాపురం, భీమవరం, విశాఖపట్నం, రాజమండ్రి, నరసారావుపేట, గరివిడి, బొబ్బిలి వంటి ప్రాంతాల్లో అంధుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పదో తరగతి వరకు బ్రెయిలీ లిపిలో బోధిస్తారు. భవిత సెంటర్లు, ఉన్నత పాఠశాలల్లో బ్రెయిలీలో శిక్షణ పొందిన టీచర్లు బోధిస్తున్నారు.

ప్రభుత్వమే పుస్తకాలు అందించాలి

బ్రెయిలీ లిపి పుస్తకాలను ప్రభుత్వం సరఫరా చేయాలని పలువురు అంధులు కోరుతున్నారు. గుంటూరులో బ్రెయిలీ ప్రెస్ ఉపయోగంలో లేదు. అనంతపురం, హైదరాబాదు, బెంగుళూరు నుంచి ఆయా సబ్జెక్టుల పుస్తకాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం తరపున బ్రెయిలీ ప్రెస్‌ను ఏర్పాటు చేసి ఉచితంగా పుస్తకాలు అందించాలని కోరుతున్నారు. తెలంగాణ జిల్లా మహబూబాబాద్‌లో ఇంటర్, హైదరాబాదు చిన్న జీయర్ కాలేజీలో డిగ్రీ వరకు బ్రెయిలీ లిపిలో బోధన చేస్తున్నారు.

తెలుగు మాస్టారుగా ప్రశంసలు




కైకలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంటుగా పని చేస్తున్న గాజుల సురేష్ అంధుడు. నరసాపురం అంధుల పాఠశాలలో పది వరకు చదివారు. ఇంటర్, డిగ్రీ, బీఈడీ హైదరాబాదులో చేశారు. ఎంఏ తెలుగు, ఎంఏ పొలిటికల్ సైన్స్ చేశారు. తెలుగు మాస్టారుగా చక్కటి పేరు తెచ్చుకున్నారు. తాటిపాక హైస్కూల్‌లో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న అంధురాలు సుజాతను వివాహం చేసుకున్నారు. బ్రెయిలీ లిపితోనే ఈ స్థాయికి చేరానని సురేష్ చెబుతుంటారు.

రాష్ట్రపతి నుంచి అవార్డు



అన్నింటా మేటి అన్న పదానికి నిలువెత్తు నిదర్శం కైకలూరుకు చెందిన అంధురాలు జ్యోత్స్న ఫణిజా. ఢిల్లీ యూనివర్సిటీలో ప్రస్తుతం సీనియర్ ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆమె నరసాపురం అంధుల పాఠశాలలో చదివారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఇంగ్లీషులో లిటరేచర్ చేశారు. టీవీ ఛానల్స్ నిర్వహించిన పాటల పోటీల్లో ప్రథమ స్థానం సాధించారు. పుస్తకాలు రాశారు. మారథాన్ పోటీలలో విజయం సాధించారు. కంప్యూటర్ నాలెడ్జ్‌లో దిట్ట. రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో ఉన్నాయి. బ్రెయిలీ చేసిన కృషి ఎంతో మందికి దారి చూపిందని జోత్స్న చెబుతారు.


రెండేళ్లు శ్రమించి బ్రెయిలీ లిపి రూపకల్పన



లూయిస్ బ్రెయిలీ 1829లో ఫ్రాన్స్‌లో జన్మించాడు. చిన్న వయసులోనే చూపు కోల్పోయాడు. అక్షరం, సంఖ్య సూచించడానికి ఆరు చుక్కలను ఉపయోగించి స్పర్శ ద్వారా గుర్తించేలా కోడ్ కనుగొన్నారు. దీనిని సాధించడానికి ఆయనకు రెండేళ్లు పట్టింది. అతి చిన్న వయసులోనే లూయిస్ మరణించాడు. ఆయన మరణాంతరం ఇది విశేషంగా అమలులోకి వచ్చింది. ప్రస్తుతం బ్రెయిలీ కోడ్ ద్వారా గణితం, సంగీతం, కంప్యూటర్ ప్రొగ్రాం చదవడం, రాయడం చేయవచ్చు. అంధుల కోసం ఎన్వీడీఏ, జాష్ వంటి స్క్రీన్ రీడర్స్, అండ్రాయిడ్ ఫోన్‌లో టాక్ బ్యాక్ సాఫ్ట్‌వేర్‌లు ఉపయోగిస్తున్నారు.

ముక్కోటికి ముస్తాబవుతున్న శ్రీవారి క్షేత్రం

- ఆలయ ఉత్తర ద్వారాలు, పరిసరాల సుందరీకరణ పనులు
- ఆన్‌లైన్‌లో రూ.500 ప్రత్యేక దర్శనం టికెట్లు



ముస్తాబవుతున్న ఉత్తర ద్వారాలు



అనివేటి మండపంలో విద్యుద్దీప అలంకారం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం ముక్కోటికి ముస్తాబవుతోంది. ఈ ఏడు స్వామివారి ఉత్తర ద్వార దర్శనానికి వేలాది మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్న ఆలయ అధికారులు అందుకు అనుగుణంగా భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ క్రమంలో తాత్కాలిక క్యూలైన్ల నిర్మాణం, ఉత్తర ద్వారాల ముస్తాబు, ఆలయానికి, పరిసరాలకు విద్యుద్దీప అలంకరణలు, ఘాట్ రోడ్లలోని డివైడర్లకు రంగులు వేసే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆ రోజు స్వామివారి ఉచిత ప్రసాదాన్ని అనివేటి మండపంలో పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం ఈ నెల 10న కావడంతో, 9న మధ్యాహ్నం 2 గంటల నుంచి నిర్వహించే గిరి ప్రదక్షిణకు సైతం ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఈ పనులను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ డీవీ భాస్కర్ తదితరులు పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే వీఐపీలతో పాటు సాధారణ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ఏర్పాటు చేస్తున్నారు. గోవింద స్వాములు, స్థానికుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేస్తున్నారు. శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కోసం రూ.500 టికెట్లు జ్జి ఇట://రీరీరీ౹ జ్హరుఝ ఇ౹ట౹ ఇఃజౌరి.జీ ఓ వెబ్‌సైట్‌లో భక్తులకు అందుబాటులో ఉంచినట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.

విద్యుత్ ధరలపై ప్రజాభిప్రాయ సేకరణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 2025–26 సంవత్సరానికి వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని విద్యుత్ భవన్‌లో, జంగారెడ్డిగూడెం కార్యాలయంలో ఈ నెల 7, 8, 10వ తేదీల్లో బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తారని ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ పీ సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీలోని ఏ కన్వెన్షన్ సెంటర్, ఈ నెల 10న కర్నూలు కమిషన్ ఆఫీస్ కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ప్రత్యక్ష హాజరు ద్వారా, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహిస్తారని తెలిపారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ నియంత్రణ మండలి ప్రతిరోజు అన్ని డిస్కంల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు వింటుందన్నారు. సందేహాలు, సలహాలు, సూచనలు ఇచ్చేందుకు వినియోగదారులెవరైనా పాల్గొనవచ్చని, ఈ మేరకు రిజిస్ట్రేషన్ కోసం స్థానిక విద్యుత్ ఆపరేషన్ సర్కిల్ కార్యాలయంలో(ఎస్‌ఈ ఆఫీస్) లేదా ఏదైనా విద్యుత్ డివిజనల్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

దర్శిపర్రులో జోరుగా గుండాట



గుండాట చుట్టూ గుమి గూడిన దృశ్యం

పెంటపాడు: నూతన వత్సవరం పురస్కరించుకొని దర్శిపర్రు గ్రామంలో నిర్వహిస్తున్న అమ్మవారి ఉత్సవాలలో భాగంగా గ్రామంలో గుండాట, పేకాటలు జోరందుకున్నాయి. రాత్రి సమయాలలో కాకుండా పట్టపగలే ఇవి జరగడం విశేషం. జనవరి 1 నుంచి గ్రామ దేవత పుంతలో ముసలమ్మ అమ్మవారి ఉత్సవాలు 5 రోజులు పాటు జరుగుతాయి. దానిలో భాగంగా అమ్మవారి ఉత్సవాలు శుక్రవారం నాటికి మూడు రోజులు ముగిశాయి. అమ్మవారి గుడికి సమీపంలో జెడ్పీ స్కూలు వద్ద గుండాటలు జోరుగా సాగాయి. వీటిని అడ్డుకోవాల్సిన, ఉత్సవ కమిటీ పెద్దలు, పోలీసులు చోద్యం చూస్తూ ఉండి పోయారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు



ప్రమాదవశాత్తు బోల్తా కొట్టిన ఆటో

నరసాపురం: 216 జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం పట్టణంలోని రుస్తుం బాద ప్రాంతంలోని విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో బోల్తా కొట్టింది. అదృష్టవశాత్తు ఆటోలో తక్కువ మందే ఉండటం, పరిమిత వేగంతో వెళ్తున్న కారణంగా ప్రమాదం తప్పింది. ఐదుగురు విద్యార్థులకు స్వల్ప గాయలు అయ్యాయి. సీతారామపురం నుంచి ఆటోలో నలుగురు కాలేజ్ విద్యార్థులు, ముగ్గురు కాన్వెంట్ విద్యార్థులను ఎక్కించుకుని ఆటో నరసాపురం వైపు వస్తోంది. ఎదురుగా వేగంగా వస్తున్న మోటార్‌బైక్‌ను తప్పించబోయి ఆటో అదుపు తప్పి రోడ్డు దిగువకు బోల్తా కొట్టి పడిపోయింది. అక్కడున్న ఓ అపార్ట్‌మెంట్ ప్రహరీ గోడకు గుద్దుకుని నిలిచిపోయింది. అటుగా వెళ్తున్న వారు వెంటనే అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులను బయటకు తీశారు.

స్విమ్మింగ్ చాంపియన్‌కు సన్మానం



స్వామినాయుడును సన్మానిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): 35వ జాతీయ సౌత్ జోన్ స్విమ్మింగ్ పోటీల్లో 50 మీటర్ల బటర్‌ఫ్లై విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించిన బలగ స్వామినాయుడుని గురువారం స్థానిక శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ క్రీడలనే ఉపాధి మార్గం చేసుకుంటూ ఎంతోమంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేషంగా రాణిస్తున్నారని తెలిపారు. వీరిని ఆదర్శంగా తీసుకుని యువ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగావకాశాలూ మెరుగుపడతాయని స్పష్టం చేశారు. పాఠశాల డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్ జాతీయ స్థాయిలో పతకం సాధించిన విద్యార్థికి రూ.10 వేలు పురస్కారం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ శ్రీనివాస్, నున్న స్వాతి కిషోర్, వందనాల దుర్గ భవాని శ్రీనివాస్, ఆర్నేపల్లి తిరుపతి, సూర్య స్కూల్ డైరెక్టర్ కొండపల్లి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లి వస్తూ మృత్యుఒడిలోకి



కొండ్రెడ్డినగర్ వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుబ్బ తిరుపతి స్వామి(56)



ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతిన్న కారు

భీమడోలు: తిరుపతి దర్శనానికి వెళ్లి వస్తుండగా.. లారీని కారు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో కారు డ్రైవర్ మృతి చెందాడు. జాతీయ రహదారిపై భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ శివారు కొండ్రెడ్డి నగర్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో గుబ్బ తిరుపతి స్వామి(56) మృతి చెందాడు. ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గుంటపల్లి గ్రామానికి చెందిన గుబ్బ తిరుపతి స్వామి కారులో గంటా గోవింద్ కుటుంబానికి చెందిన అమలావతి, అలేఖ్య, లక్ష్మీ, సందీప్, అవినాష్ ఈనెల ఒకటిన తిరుపతి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా కొండ్రెడ్డినగర్ వద్ద ట్రాలీ లారీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. ఇది గమనించని కారు డ్రైవర్ గుబ్బ తిరుపతి స్వామి అతివేగంగా వెనుక నుంచి లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలైన తిరుపతి స్వామి(56)ని హైవే అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ప్రమాదంలో తీవ్రగాయాలైన గంటా అమలావతిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడి అల్లుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరాటే, కర్రసాము పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన భీమవరం, నరసాపురం విద్యార్థులు

భీమవరం అర్బన్: గత నెల డిసెంబర్ 29 నుంచి 31 వరకు తమిళనాడులోని కొయంబత్తూరులో జరిగిన కర్రసాము, కరాటే పోటీలలో భీమవరం, నరసాపురం విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రికార్డు సృష్టించారని కరాటే శిక్షకుడు జె.విజయ భాస్కర్ తెలిపారు. మండలంలోని చినఅమిరంలోని కరాటే ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం వివరాలు వెల్లడించారు. పోటీల్లో భీమవరం నుంచి కరాటే విద్యార్థులు టి.సాత్విక్, బి.రిషిక్, కె.అభిలాష్, ఎస్.జాతిన్, పి.జాన్సిలాల్ నారాయణ, నరసాపురం విద్యార్థులు సీహెచ్ ఎస్తేరు రాణి, సీహెచ్ కుషల్ హరిహరన్, అబ్దుల్, ఎం.చైతన్యలు పాల్గొని కర్రసాములో ఏకధాటిగా గంట సేపు తమ ప్రతిభను చాటి రికార్డు సృష్టించి మెడల్స్ సాధించారన్నారు. కర్రసాము, కరాటేలో ప్రతిభ సాధించిన విద్యార్థులను పలువురు అభినందించారు.

క్లుప్తంగా

అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



అమ్మవారిని దర్శించుకుంటున్న మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అమ్మవారి ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలకు తప్పక ఉండాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. టూ టౌన్‌లోని సీతారాంపేట, కొబ్బరితోటలో పుంతలో ముసలమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మారాజు, బొద్దానిశ్రీను, బొడ్డుసాయి, బండారి నాగు, వెలనాటి సత్తిబాబు, సూరపురెడ్డి బాబు, మేడిశెట్టి శ్రీను, సతీష్, తదితరులు పాల్గొన్నారు. ఉదయం నుంచి విశేష పూజలతో పాటు యువఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మహిళ సభ్యులచే శ్రీ శ్రీనివాస కల్యాణం గానామృతం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబాన్నీ సందర్శించి క్యాన్సర్ సర్వేను చేపట్టాలి



అత్తిలి పీహెచ్‌సీలో రిజిస్టర్లను తనిఖీ చేస్తున్న జిల్లా డీపీఎంఓ డాక్టర్ ధనలక్ష్మి

అత్తిలి: క్యాన్సర్ సర్వే కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ప్రతి కుటుంబాన్నీ సందర్శించి వివరాలు నమోదు చేయాలని జిల్లా డీపీఎంఓ డాక్టర్ ధనలక్ష్మి తెలిపారు. అత్తిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆమె సందర్శించారు. పీహెచ్‌సీ ద్వారా అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాలను వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో జరుగుతున్న ప్రసవాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్ల గురించి ఆరా తీసారు. ఆరోగ్యకేంద్రంలోగల పలు రిజిష్టర్‌లను ఆమె తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కె నాగరాజు, ఎంపీహెచ్‌ఏ జెఎస్ గనిరాజు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండరు, డైరీలు ఆవిష్కరణ కార్యక్రమంలో వడ్డీ రఘురామ్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వింగ్స్ ఆఫ్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు వడ్డీ రఘురామ్ నాయుడు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ గొర్రెల శ్రీనివాస్, ఓల్డ్ స్టూడెంట్స్ చిరివేళ్ల సాయి మహంతీర్, తమ్మిశెట్టి సూర్య, గురజాల శ్రీనివాస్, విజ్జు గణేష్ పవన్, స్వామి, వినయ్, అదీప్, వసంత్, వంశీ, రామకృష్ణ, శ్రీను, నవీన్, సాయి పాల్గొన్నారు.

తల్లికి వందనం ఇవ్వాలని ఏఐఎస్‌ఏ నిరసన



నిరసన తెలుపుతున్న ఏఐఎస్‌ఏ నాయకులు

తణుకు అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్‌ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి ధ్వజమెత్తారు. తణుకు ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి విద్యార్థికి రూ.15వేలు ఇవ్వకుండా వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇస్తామనడం మోసపూరితమైన చర్య అని విమర్శించారు. రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో తల్లికి వందనం పథకం ఈ విద్యా సంవత్సరంలో అమలు చేస్తారని ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూశారని, కానీ కూటమి ప్రభుత్వం వారికి నిరాశ మిగిల్చిందని దుయ్యబట్టారు. ఈ పథకం అమలు చేస్తే విద్యార్థులకి ఇచ్చే రూ.15 వేలతో సంబంధిత పాఠశాలల్లో ఫీజులు చెల్లించే వెసులుబాటు ఉండేదని, కానీ వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తానని మొండిచేయి చూపడం దుర్మార్గమన్నారు. వి.పవన్, పి.అనీల్, ఆర్.మణి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

పోడూరు: ఉపాధి హామీ పనులపై నిర్వహిస్తున్న సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని నాలుగు గ్రామాల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించారు. కవిటం, పి.పోలవరం, అప్పన్నచెరువు, రావిపాడు గ్రామాల్లో చేసిన పనులపై తనిఖీ నిర్వహించారు.

సృజనను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారు

- సైన్స్ ఫెయిర్‌లో అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు
- సైన్స్‌రంగం పట్ల ఆసక్తి చూపిస్తున్న విద్యార్థులు
- నేడు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ వీరవాసరంలో
- తణుకు నియోజకవర్గం నుంచి జిల్లాస్థాయికి 8 ప్రదర్శనలు



తణుకులో జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో తణుకు గరల్స్ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు



తణుకులో జిల్లా స్థాయికి ఎంపికైన ప్రాజెక్టుతో దువ్వ హైస్కూలు ఉపాధ్యాయుడు

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సైన్స్ రంగం దినదినాభివృద్ధి చెందుతున్న నేటి రోజుల్లో ఎన్నో నూతన ఆవిష్కరణలు ఆవిష్కరింపబడుతున్నాయి. సైన్స్‌రంగం పట్ల విద్యార్థులు లోతైన ఆలోచనలు చేయడంతో పాటు సైన్స్ ప్రయోగాల్లో నూతన ఒరవడి సృష్టిస్తున్నారు. ఇందుకు నిదర్శనంగా సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు అద్దం పడుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో గతనెల 30వ తేదీన పాఠశాల స్థాయిలో ఈ సైన్స్ ఫెయిర్ ప్రారంభించగా అందులో ఎంపికైన ప్రదర్శనలు ఈనెల 2వ తేదీన మండలస్థాయికి, మండల స్థాయి నుంచి 4వ తేదీన వీరవాసరంలో జరిగే జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి.

మండల స్థాయిలో 116 ప్రదర్శనలు..

తణుకు నియోజకవర్గం పరిధిలోని తణుకు మునిసిపాలిటీలో తణుకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, అత్తిలి మండలానికి సంబంధించి అత్తిలి జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల, ఇరగవరం మండలానికి సంబంధించి ఇరగవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఈనెల 2వ తేదీన నిర్వహించిన మండలస్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు సైన్స్ విజ్ఞానాన్ని తెలియజేశాయి. రూపొందించిన ప్రదర్శనలను జిల్లా స్థాయికి ఎంపికచేయడంలో న్యాయనిర్ణేతలు కీలకంగా వ్యవహరించారు. 8 కేటగిరీల్లో నిర్వహించిన ఈ సైన్స్ ఫెయిర్‌లో వ్యక్తిగతం, గ్రూపు, టీచర్ ఈ మూడు విభాగాల్లో ప్రదర్శనలు రూపుదిద్దుకున్నాయి. మండలస్థాయిలో తణుకు మునిసిపాలిటీ, మండలం నుంచి 11 ఉన్నత పాఠశాలలు, 3 ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి 55 సైన్స్ ప్రదర్శనలు, అత్తిలి మండలానికి సంబంధించి 10 ఉన్నత పాఠశాలలు, 4 పాథమికోన్నత పాఠశాలల నుంచి 40 ప్రదర్శనలు, ఇరగవరం మండలానికి సంబంధించి 7 ఉన్నత పాఠశాలల నుంచి 21 ప్రదర్శనలు చొప్పున మొత్తం 116 ప్రదర్శనలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేశారు. ఇందులో తణుకు నుంచి 3, అత్తిలి నుంచి 2, ఇరగవరం నుంచి 3 ప్రదర్శనలు జిల్లాస్థాయికి ఎంపికయ్యాయి.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ఇమో డయాలసిస్, కంపోస్ట్ కంబ్లర్, భూకంపాలు గుర్తించే అలారమ్స్, మ్యాథ్స్ వరల్డ్, అప్లికేషన్స్ ఆఫ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్,అంగవైకల్యాల వక్తులు నడిపే వాహనం, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్, మాగ్నటిక్ తార్పలిన్ వంటి ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

విద్యార్థుల సైన్స్ ప్రదర్శనలు అలరించాయి



విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసే క్రమంలో నిర్వహించే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు ఆలోచింపజేశాయి. గైడ్ టీచర్ల తోడ్పాటుతో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలు అత్యున్నతంగా నిలిచాయి. సైన్స్ పట్ల విద్యార్థులకు ఉన్న పరిజ్ఞానం ఈ ప్రదర్శనలో బయటకు వచ్చింది. సైన్స్‌పట్ల కొద్దిగా మక్కువ చూపించే విద్యార్థులను గుర్తించి సానపడితే వారిలో ఉన్న నైపుణ్యాన్ని రేపటితరానికి అందించే వెసులుబాటు ఉంటుంది. తణుకు, అత్తిలి, ఇరగవరం మూడు మండలాల్లోను పాఠశాల, మండల స్థాయిలో విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయుల సేవలను మెచ్చుకోవాల్సిందే.

– డి.మురళిసత్యనారాయణ, డీవైఈవో, తణుకు

ఎరువుల వాడకంపై అవగాహన



వరి నాట్లును పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు

ఇరగవరం: ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కలిగియుండాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఇరగవరం మండలంలోని కొత్తపాడు, అయినపర్రు తదితర గ్రామాల్లో రబీ పంటలను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులు పలు సూచనలు చేశారు. త్వరగా వరి నాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

విధుల బహిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): అనంతపురం త్రీ టౌన్ సీఐ శాంతిలాల్‌ను అరెస్టు చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ సభ్యులు డిమాండ్ చేశారు. అనంతపురంలో సీనియర్ న్యాయవాది బోయి వెంకట శేషాద్రి మృతికి నిరసన తెలియజేస్తు పట్టణంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దూలం విజయకుమార్, ఉపాధ్యక్షులు కంకట శ్రీనివాస్‌రావులు మాట్లాడారు. అనంతపురంలో త్రీ టౌన్ సీఐ చర్యల వల్లే అతను మృతి చెందారని ఆరోపించారు. న్యాయవాదుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో న్యాయవాదులు గోపాలరావు, మణిరాజు, జగదీష్, నరేష్, ధర్మరాజు, మణికంఠ తేజ, రామావతారం తదిరతులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇంటి నిర్మాణాలు చేపట్టాలి



గృహ నిర్మాణ లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ హరిహరనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ సూచించారు. శుక్రవారం మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలోని ప్రభుత్వ ఇంటి నిర్మాణాల లే అవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ఇంటి నిర్మాణాలను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగానే మండలంలోనూ, పట్టణంలోనూ ఒక్కో లే అవుట్‌ను పరిశీలించామన్నారు. గృహ నిర్మాణ శాఖ, డీఆర్‌డీఏ సమన్వయంతో గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఈఈ బీవీ.రమణ, డీఈ కేవీవీఎస్. ప్రసాద్, ఏఈ వైవి.వెంకట్రావు, ఈవోపీఆర్‌డీ ఎం.వెంకటేష్, వెలుగు ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



పట్టణంలోని వార్డులలో అవగాహన ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణంలో ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దామని, దోమ కాటు నుంచి రక్షణ పొందుదామని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వీ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఆరోగ్య నియమాలను పాటించాలని, ఆరోగ్య భద్రత సాధించాలని, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉందామని నినాదాలు చేస్తు పట్టణంలో వీకర్స్‌కాలనీ, కడకట్ల ఆరోగ్య కేంద్రాలు ఆధ్వర్యంలో 1, 31 వార్డులలో డ్రై డే కార్యక్రమాలు, ఇంటింటికి అవగాహన, వార్డులలో పరిశీలనలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్య నియమాలు పాటించాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ద్వారా దోమలు ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు జయమేరీ, మల్లిక, రమణ, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశాలు స్వాతి, దుర్గ, లక్ష్మి, ఆరోగ్య సహాయకులు ఏలూరి కాంతారావు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయాలి



ఇంటి స్థలాలు దరఖాస్తులు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు ఆధ్వర్యంలో స్థానిక 29వ వార్డులో పేదలకు ఇళ్ల స్థలాల దరఖాస్తులు పూర్తిచేయించారు. భీమారావు మాట్లాడు తూ సొంత గృహం లేక అద్దెలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్న నిరుపేదలకు వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరుచేయాలన్నారు. గృహ నిర్మాణానికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, సికిలే పుష్పకుమారి, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, తూము సత్యనారాయణ, వడ్డాది మేరీ, నిమ్మకాయల విజయ్‌కుమార్, సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గర్భిణులు సంపూర్ణ పోషకాహారం తీసుకోవాలి



అత్తిలి: గ్రామ ఆరోగ్య దినం కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్మయి



పౌష్టికాహార ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అత్తిలి: గ్రామీణ ప్రాంతాలలో మాతాశిశు ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి పోషణపై అవగాహన కల్పించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ టి కిరణ్మయి అన్నారు. గ్రామ ఆరోగ్య పోషణ దినంలో భాగంగా శుక్రవారం ఆరవల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్యసేవలు, పోషణ సలహాలు, టీకాలు, ఇమ్యునైజేషన్‌పై వైద్యాధికారిణి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కడలి శాంతమూర్తి, వేణుగోపాలస్వామి, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, రాజేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉండ్రాజవరపు రాణి, వీఎల్ఎస్ కుమారి, ఆశా వర్కర్ ధనలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది గుబ్బల విజయవాణి, పి విజయజ్యోతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. కొమ్మరలో గ్రామ ఆరోగ్య పోషణ దినంలో భాగంగా మంచిలి సెక్టార్ కొమ్మర అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యం, పోషకాహారంపై ఐసీడీఎస్ సీడీపీఓ ఎంబీబీ ప్రమోదకుమారి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వరిఘేడులోగర్భం దాల్చినప్పటి నుంచి గర్భిణులు మంచి ఆహారపు అలవాట్లు, విశ్రాంతి, ఆరోగ్య పరీక్షలు తప్పకుండా చేయించుకోవాలని తిరుపతిపురం సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎం టి రత్నకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కె మీనాకుమారి, సిహెచ్ బేబి, వై శ్రీదేవి, జి సావిత్రి, మహిళా సంరక్షణ అధికారిణి వై సత్యశ్రీ, ఉపాధ్యాయులు టి సంధ్య, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన

ఇరగవరం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో నిర్లక్ష్యం తగదని ఐసీడీఎస్, వైద్యాధికారులు వివరించారు. శుక్రవారం మండలంలోని తూర్పు విప్పర్రు గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విలేజ్ హెల్త్ న్యూట్రీషియన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎస్.కాంతకుమారి, హెల్త్ అసిస్టెంట్ రెడ్డి, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే మహిళలకు ఆదర్శం



తాడేపల్లిగూడెం(టీఓసీ): మహిళా ప్రధానోపాధ్యాయులను సత్కరిస్తున్న డీవైఈఓ, ఎంఈఓ తదితరులు



అత్తిలి: బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



తణుకు అర్బన్: సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలో మాట్లాడుతున్న కామేష్

అత్తిలి: మహిళలందరికీ సావిత్రిబాయి పూలే ఆదర్శమని, ఆమె తెగువతో నేడు మహిళలంతా మంచిగా విద్యనభ్యసించి ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నారని పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఎస్ పురుషోత్తం అన్నారు. అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. సావిత్రీబాయి పూలే చిత్రపటానికి సీనియర్ ఉపాధ్యాయిని ఎస్ సుజాతదేవి పూలమాలలు వేశారు. ఈసందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ సావిత్రిబాయి స్ఫూర్తితో బాలికలు చదువులో పట్టుదల కలిగి రాణించాలన్నారు. మహిళా ఉపాధ్యాయిని ఎస్ సుజాతదేవి మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే మహిళలందరికీ ఆదర్శమని, ఆమె అనుసరించిన మార్గంలో మహిళలందరూ నడచి ఆదర్శవంతంగా మారాలని కోరారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సుభద్ర, లలిత, రమా ప్రతిభ, నాగలక్ష్మి, ప్రియాంక, శ్రీనివాసరావు, ఆత్మలింగం, శ్రీకాంత్, రమేష్, రాంబాబు, రాంప్రసాద్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. డీవైఈఓ నిమ్మగడ్డ రవీంద్రభారతి, ఎంఈఓలు హనుమ, పీఎంకే జ్యోతిలు హాజరైయారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ నిమ్నవర్గాల అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటాలు చేసిన మహిళ పూలే అన్నారు. అనంతరం మహిళా ప్రధానోపాధ్యాయులు లాల్ బీబి, పార్వతి, మల్లీశ్వరి, తబిత, ధనలక్ష్మి, కనకదుర్గ, నాగవల్లి, సూర్యకుమారిలకు సత్కారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వనాథ్, హెచ్ఎం మైనం సత్యనారాయణ, అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో...

కట్టుబాట్లు, సంస్కృతి సంప్రదాయాల పేరుతో మూఢత్వంతో స్త్రీల అణచివేతకు వ్యతిరేకంగా ఉద్యమించిన గొప్ప సామాజిక ఉద్యమనేత సావిత్రిబాయి పూలే అని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పం కమారి అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పట్టణంలో సీపీఎం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు, మహిళా నాయకులు చింతకాయల పద్మ, రాణి, స్వర్ణకుమారి, మాధురి, శైలజ, విజయ, సరోజిని తదితరులు నివాళులర్పించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిళా అధ్యాపకులు డి.స్రవంతి, నాగ భవాని, సీతామహాలక్ష్మి, శీరీషా, నిర్మలను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసరావు, తిరుపతయ్య, మాణిక్యం రాజు, వెంకటేశ్వరరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి, సావిత్రి బాయి పూలు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలు జరిగాయి. లూయిస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బాల ఈశ్వరయ్య, హెచ్ఎం బి.జ్యోతి, ఎం.చంద్రకుమారి, కే.కుమారి, సత్యవతి, మానవతా అధ్యక్షులు పచ్చ వెంకటేశ్వరరావు, సెక్రటరీ యర్రా ఆంజనేయస్వామి, కోశాధికారి యెగ్గిన శరత్‌బాబు, చేకూరి బంగ్గారాజు, బురిడీ సతీష్, మిరియాల కిషోర్, తదిరతులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళులు

తణుకు అర్బన్: సావిత్రి బాయి పూలే జయంతిని తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్ మాట్లాడుతూ పురుషాధిక్య సమాజాన్ని ఎదుర్కొని మహిళలకు విద్య నేర్పించేందుకు పూణేలో పాఠశాలను ఏర్పాటు చేసిన తొలి గురువు సావిత్రిబాయి పూలే అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎ.రామకృష్ణ, జి.అంబేద్కర్, పొట్ల సురేష్, కత్తుల జెస్‌పాల్, తెన్నేటి సురేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం



తణుకులో రైతు కూలీ సంఘం సావనీరును ఆవిష్కరిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్న పాలకుల విధానాలపై, రైతాంగం పండించే పంటలకు గిట్టుబాటు ధరలపై పోరాడుదాం అని రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల సావనీరు ఆవిష్కరణ సభలో వక్తలు పిలుపునిచ్చారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల సావనీరు ఆవిష్కరణ సభ తణుకులోని సురాజ్య భవనంలో శుక్రవారం రైతు కూలీ సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో సావనీరును డీవీవీఎస్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కూలీ సంఘం రాష్ట్ర మహాసభల్లో వైవిధ్యపూరితమైన విషయాలపై చక్కటి సెమినార్లను నిర్వహించారని, వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని, ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెట్టి వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఝాన్సీ మాట్లాడుతూ గత 70 సంవత్సరాలుగా పాలకులు అమలు చేస్తూ వస్తున్న సామ్రాజ్యవాద అనుకూల విధానాల ఫలితంగానే వ్యవసాయ రంగం తీవ్రమైన సంక్షోభంలో కూరుకుపోయిందని, రైతాంగ ఆత్మహత్యలు సాధారణ విషయంగా మారడం దురదృష్టకరమన్నారు. ఈ సభలో రాజ్యాంగ హక్కుల పరిరక్షణ వేదిక నాయకులు సంకు మనోరమ, ఏఐటీయూసీ నాయకులు కోనాల భీమారావు, డాక్టర్ రమేష్ చంద్రబాబు, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ, తదితరులు సావనీరును ప్రస్తావిస్తూ మాట్లాడారు. రైతు కూలీ సంఘ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా 26వ మహాసభలు జయప్రదం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీపీఎం జిల్లా 26వ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణలు పిలుపునిచ్చారు. భీమవరంలో జరుగుతున్న సీపీఎం బహిరంగ సభకు శుక్రవారం తాడేపల్లిగూడెం పట్టణం నుంచి భీమవరం వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న సీపీఎం

తణుకు అర్బన్: రానున్న కాలంలో ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం సాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి పీవీప్రతాప్, పట్టణ కార్యదర్శి అడ్డగర్ల అజయ కుమారి అన్నారు. శుక్రవారం భీమవరంలో నిర్వహించిన జిల్లా మహాసభలకు తణుకు నుంచి భారీగా వెళ్లిన సందర్భంగా వారు మాట్లాడారు. సీపీఎం పార్టీ ఏర్పడిన రోజు నుంచి నేటి వరకు పేద బడుగు బలహీనవర్గాల సమస్యలపై పోరాటం సాగిస్తున్నట్లు స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని మారినా ప్రజల సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదో ప్రజలు ఆలోచించాలని అన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు వలనే ఎన్నో హక్కులు, చట్టాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ప్రజల పక్షాన సీపీఎం పార్టీ రానున్న రోజుల్లో పెద్దత్తున పోరాటాలు సాగిస్తుందని చెప్పారు. గుబ్బల గోపి, కె.నాగరత్నం, గార రంగారావు, వెంకటేశ్వరావు, అంబటి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.